# దశ దినోత్సవం

తొమ్మిదింటికి మొదలవాల్సిన లెక్చర్ తొమ్మిది గంటల ఇరవై మూడు నిముషాలకి కూడా మొదలవలేదు. దానికి లెక్చెరర్ బసవరాజు బాధ్యుడు కాదు.

విద్యార్థులే, ఆ రోజు ఏకారణం చేతనయినా ఓ చిన్న మెరుపు సమ్మెకి పిలుపు వస్తుందేమోనని ఎదురు చూస్తూ క్లాసులోకి రాలేదు. క్లాసు బయట నిలబడి ఆశగా ఎదురు చూస్తున్న విద్యార్థుల మధ్య హఠాత్తుగా వివాదం మొదలైంది. "ఇందాక పొడుగు జుట్టుతో కాసు వైపు వెళ్లింది బసవరాజుగారే!" అని కొందరంటే "కానోకాదు బసవరాజుగారిది పొట్టి జుట్టు కదా!" అని మరో వర్గం వారన్నారు.

"మీ మొహం. మీరాయన మొహం మర్చిపోయారు" అన్నారు మొదటి వర్గం.

"మొహం మర్చిపోయాం అని మీరంటే మీకేమీ అభ్యంతరం లేదు. కాని జుట్టు విషయంలో మేం పొరపడం. ఆయన్ది పొట్టి జుట్టని మాకు నిర్ధారణగా తెల్సు ఉపాధ్యాయుల గొర్రెతోక జీతాలని నిరసిస్తూ ఆయన పొట్టి జుట్టుంచుకొంటారు. మనం క్రితం క్లాసుకు వెళ్ళినప్పుడు నుదిటి మీది ఆయన ముంగురులు ఆయన కనుబొమ్మలు దిగలేదు. ఇందాక క్లాసు వైపు వెళ్ళినాయన మొహం గుర్తు పట్టడానికి వీల్లేనంతగా జుట్టు ఆయన మొహాన్ని కప్పేసింది" అన్నారు రెండో వర్గం వారు.

"క్రితం క్లాసు, క్రితం క్లాసు అంటున్నారు మీరు, క్రితం క్లాసు నెల్రోజుల క్రితం జరిగింది. ఈ నెల్రోజుల్లో జుట్టు పెరగదా! పైగా మనం ఈ నెల్రోజులుగా బస్సులు జాతీయం చెయ్యాలని, నావికుల దౌర్జన్యాలు నశించాలని సమ్మెలు, బంద్‌లు చేస్తూ వచ్చాం. దాంతో ఈ ఊళ్లో ఉన్న క్షౌరశాలలు నెల్రోజులుగా మూతపడ్డాయి. అందుకని బసవరాజుగారు గత్యంతరం లేక జుట్టు పెంచుకొనుంటారు. ఆ మాట కొస్తే మీ జుట్లూ పొడుగయ్యాయి. ఈ నెల్రొజుల్లో. పైగా పే కమీషన్లు వచ్చాక మేష్టర్ల జీతాలు గొర్రెతోక సైజు నుంచి గాడిద తోక సైజుకి పెరిగాయి. దాంతో మేష్టర్లు కొందరు బీదల పార్టీలు వదిలి ఆధ్యాత్మిక చింతనలో పడి జుట్టు పెంచారు" అంటూ మొదటి వర్గం, రెండో వర్గాన్ని చెరిగేసారు.

ఈ రెండు వర్గాలు మూడు నెలల క్రితం ఓ సమ్మె సందర్భంలో కలిగిన అభిప్రాయ

భేదాల వల్ల ఏర్పడ్డాయి. బస్సుల మీద విసరడానికి రెండు సెంటీమీటర్లకి మూడు సెంటిమీటర్లకి మధ్యనున్న సైజుల్లో ఉన్న రాళ్ళే అత్యుత్తమమైనవనీ, అవే అత్యుత్తమమైన ఫలితాలిస్తాయని ఒక వర్గం వారభిప్రాయపడ్డారు. కాంక్రీటుకు వాడే రాళ్ళ సైజు అదే అని వాళ్ళు ఉదాహరణిచ్చారు.

అయితే మరికొందరు నాలుగు, అయిదు సెంటిమీటర్ల మధ్య ప్రమాణం కలవే అత్యుత్తమ సమ్మెసాధనాలని, కావాలంటే ఫలానా యూనివర్సిటీ విద్యార్థులు వ్రాసిన "రాళ్ళ పరిమాణం - చేతిపట్టు" (స్టోన్‌సైజ్ అండ్ గ్రిప్) అనే వ్యాసం చదువుకోమని చెప్పి అంతటితో ఆగక ఆ సైజు రాళ్ళనే స్ట్రైక్‌లకి వాడే రాళ్ళకి స్టాండర్డ్ స్పెసిఫికేషన్‌గా ఐ.యస్.యస్. (ఇండియన్ స్టూడెంట్స్ సొసైటీ) వారు స్వీకరించాలని వాదించారు. ఆ సందర్భంగా తలెత్తిన అభిప్రాయ భేదాలు ఇన్ని సమ్మెలు కలిసి చేసినా సమసి పోలేదు.

ఇక్కడ విద్యార్థులు క్లాసు బయట సమ్మె పిలుపు కోసం ఎదురుచూస్తుండగా అక్కడ విద్యార్థి యూనియన్ కార్యవర్గం నాణాన్ని ఎగుర వేసింది. బొమ్మ పడితే విద్యార్థులందరికీ డిగ్రీలిచ్చి తీరాలన్న తమ న్యాయ సమ్మతమైన కోర్కెను బలపరుస్తూ సమ్మె చెయ్యాలని, బొరుసు పడితే పరీక్షలో విద్యార్థుల్ని తప్పించే క్రూర విధానాన్ని నిరసిస్తూ సమ్మె చెయ్యాలని నిర్ణయించుకొని ఆ నాణాన్ని ఎగుర వేసింది.

తొమ్మిది గంటల పదిహేను నిముషాలకి ఆ నాణెం నేల మీద పడి అటూ ఇటూ ఊగిసలాడి అంచు మీద నిలబడింది. అసంభవమైనదిగా అనుకొన్నది సంభవించింది. విద్యార్థులు విస్మయం చెందారు. తరువాత దాన్నుంచి తేరుకొని నిస్పృహ చెందారు. ఆఖరికి కార్యదర్శి "గంభీరస్వరంతో చచ్చినటు క్లాసులకే వెళ్తాం పదండి!" అని ఆదేశించాడు.

తొమ్మిది ఇరవై నాలుగుకల్లా బసవరాజు క్లాసు బయట నిరీక్షిస్తున్న వారికి విద్యార్థి సంఘ నిర్ణయం తెల్సిపోయింది. "పోదాం పదండి వెళ్తే ఆయన బసవరాజు గారైందీ కానదీ తెలుస్తుంది" అనుకొంటూ విద్యార్థులు క్లాసులోకి వెళ్ళారు. క్లాసులో ఉన్నది బసవరాజే! అతను యోగ సమాధిలో ఉన్నాడు.

బసవరాజు ఒకప్పుడు యువకుడిగా ఉండేవాడు. అల్లా ఉన్న రోజుల్లో గంట క్లాసంటే గంటా పాఠం చెప్పాలన్న తాపత్రయంతో ఆలస్యంగా వచ్చిన విద్యార్థుల మీద విరుచుకుపడేవాడు. విద్యార్థులు పడనిచ్చేవారు. కాలం మారింది బసవరాజుకి నలభై యేళ్ళు వచ్చాయి. ఓ రోజున విద్యార్థులు "మేష్టారూ! మీరల్లా విరుచుకుపడ్తే దెబ్బల్తగలగలవ్ జాగ్రత్త!" అని హెచ్చరించారు. దాంతో ఎందుకైన మంచిదని బసవరాజు శాంతం అలవర్చుకొని విద్యార్థుల రాక కోసం నిరీక్షించడం నేర్చుకున్నాడు. నిరీక్షణ కాలం వ్యర్థం కాకుండా ధ్యాన యోగాభ్యాసం మొదలు పెట్టాడు.

విద్యార్థుల అలికిడి విని బసవరాజు కళ్ళు తెరిచాడు. విద్యార్థులని చూసి సంభ్రమానందాలతో గుమ్మం దాకా ఎదురేగి క్లాసులోకి ఆహ్వానించాడు. పాఠం చెప్పడం మొదలు పెట్టాడు. మొదలు పెట్టిన కొద్ది సేపటికి బెల్లు మోగింది. విద్యార్థులు ఓ నిముషం పాటు చప్పట్లు కొట్టారు. బసవరాజు ఆశ్చర్యపోయి "ఈ మెచ్చుకోలుకి నేను ఏ విధంగా అర్హుణ్ణి?" అని అడిగాడు.

"సిలబస్ పూర్తి చేసినందుకు" అన్నాడు మొదటి వర్గం నాయకుడు. "సిలబస్ పూర్తవగానే చప్పట్లు కొట్టడం మా..."

"జన్మహక్కు" అని పూర్తిచేసారు ఆ వర్గ విద్యార్థులు.

"సిలబస్ పూర్తయిందా? నాకు తెలియదే!" అని బసవరాజు అమాయకంగా ఆశ్చర్యపోతూ అడిగాడు.

"చివరి క్లాసులో సిలబస్ పూర్తవదా?" అని రెండో వర్గం నాయకుడు కొంచెం కరుకుగా అడిగాడు. బసవరాజు పొడుగు జుట్టు పెంచుకోడం వలన కలిగిన కోపం మేళవించి.

ఈ ప్రశ్న వెనుక కొండంత కథుంది. పెద్ద తలకాయలున్నాయి. ఇంటరన్నల్ ఎసెస్‌మెంటు వినడానికి చెప్పుకోడానికి బావుంటుందని దాంతో విద్యాస్థాయి అమెరికా అంత ఎత్తుకు పెరుగుతుందని వేదికల మీద పెద్దతలకాయ లొకదాన్తో ఒకటి చెప్పేసుకొని ఒప్పేసుకొని శుభం అనుకొని ప్రవేశ పెట్టారు.

పద్ధతిలో చివరి క్లాసుకి పాఠాలెంత వర్కైతే అదే సిలబస్. ఈ యేడాది పూర్తి చెయ్యాల్సిన సిలబస్ ఇదీ అంటూ ఒకదాన్ని సంవత్సర ప్రారంభంలో అనుకోవాల్సిన బెడద తప్పుతుంది. పాఠాలు ఇంక 'బస్' అని హిందీలో అని వాటి నెత్తిమీద 'శిల' దిక్కొట్టడాన్ని సూచిస్తూ దానికి 'శిలబస్' అని పేరు పెట్టారని అదే రూపాంతరం పొంది సిలబస్ అయి ఉంటుందని లింగ్విస్టిక్స్‌లో ఒకాయన పి.హెచ్.డి. చేసాడు.

బసవరాజు ఆ ప్రశ్నకి తికమక పడి "ఇది చివరి క్లాసా?" అని అడిగాడు శాంతంగా.

"ఇది చివరి క్లాసు కాదని ఈ సంవత్సరంలో మరో క్లాసుంటుందని మీరు గుండెమీద చెయ్యి వేసుకొని చెప్పగలరా?" అని నిలదీసారు, బసవరాజు నిద్దరు విద్యార్థి నాయకులు ఏకగ్రీవంతో. అప్పుడప్పుడు రెండు వర్గాల వారికి ఏకాభిప్రాయం కుదుర్తూ ఉంటుంది.

బసవరాజు గుండె మీద చెయ్యి వేసుకొన్నాడు. అదికాక మరో క్లాసుంటుందని చెప్పడానికి గుండె బలం చాలడం లేదని పోల్చుకొన్నాడు. బయట రెండో పిరియడు చెప్పడానికి వచ్చిన మేష్టారు, విద్యార్థులు బసవరాజుని వదిలిపెట్టే క్లాసులోకి రావాలనే కోర్కెతో నిలబడి ఉన్నాడు. అతన్ని గమనించి బసవరాజు తల అడ్డంగా ఊపి, గుండె మీద చేత్తో, క్లాసు బయటకు వచ్చి మేష్టర్ల విశ్రాంతి గదికి వెళ్ళిపోయాడు.

బసవరాజుకి గుండె పోటు వచ్చిందని అందుకనే అతను గుండె మీద నుంచి చెయ్యి తియ్యలేక పోతున్నాడన్న వార్త కార్చిచ్చులా మేషర్లలో వ్యాపించి పెద్ద మేష్టారితో సహా అందరు అక్కడికి చేరుకొన్నారు.

అందరు ఏ కుమ్మడిగా "ఏమైంది?" అని అడిగారు బసవరాజుని.

అతను కాలెండరు దగ్గరకు వెళ్ళి తన ఎటెండెన్సు రిజిష్టర్‌తో పోల్చి "కొత్త విద్యా సంవత్సరంలో ఈ రోజు మన కాలేజి తెరిచి ఉంచిన తొమ్మిదో రోజు" అన్నాడు.

కొత్త సంవత్సరం మొదలై ఆర్నెల్లైనా కాలేదు అప్పుడే తొమ్మిదో వర్కింగ్‌డే వచ్చిందన్న ఆనందకం కొద్దీ బసవరాజుకి గుండె పోటు వచ్చిందని మిగిలిన మేష్టర్లు నిర్ధారణకి వచ్చేసి-

"దీనికే ఇంత ఆనందపడ్తున్నాడీ వెర్రి గురుడు. రేపు కూడా క్లాసులకి విద్యార్థులు రావడానికి నిర్ణయించుకొంటే రేపు పదో రోజవుతుంది. ఆ సంతోషంతో దశ దినోత్సవం జరిపినా జరపగలడు" అని నవ్వడం మొదలు పెట్టారు.

పెద్ద మేష్టారికి బోలుడు కోపం వచ్చింది. "నిజంగా రేపు విద్యార్థులు క్లాసులకి రావాలేగాని దశ దినోత్సవం నేను జరుపుతాను. ఊళ్లో ఆసుపత్రిలో విద్యా శాఖాధికారిగారున్నారు ఆయన్ని ముఖ్యాతిథిగా పిలిచి మరి జరుపుతాను." అని నవ్వేవాళ్ళ మొహాన ఫెడీమని అనేసాడు. ఆ పైన ఆ పొద్దున్న చివరి పీరియడ్ చివరి పావుగంట క్లాసులు కాన్సిల్ చేసి విద్యార్థులను సంప్రదింపులకి పిలిచాడు. ఆ మర్నాడు శుక్రవారం కాదు కనుక కొత్త సినిమాలేవి రిలీజు కావని, అందుకని చెయ్యడానికి వేరే పెద్ద పనులు లేవని ఆలోచించి, రెండో వర్గం నాయకుడు స్వాగత వచనాలు, మొదటి వర్గం నాయకుడు కృతజ్ఞతా పూర్వక అభినందనలు చెప్పే ఒప్పందం మీద సరేనన్నారు.

ఆ మధ్యాహ్నం బసవరాజు గుండె మీద చెయ్యి ద్వారా తన గుండెకి తగిన బలం ఉందని పోల్చుకొని విద్యార్థులు కనిపించగానే, "రేపు మీరు క్లాసులకి వస్తారు కనుక టైమ్ టేబుల్ ప్రకారం రేపు మీకు నా క్లాసుంది కనుక, గుండె మీద చెయ్యేసుకొని మీకు మరో క్లాసుందని చెప్పగలను" అని ప్రకటించాడు. ఆ పైన గుండె మీద నుంచి చెయ్యి తీసేసాడు. విద్యార్థులు గుంభనగా నవ్వారు. ఆ నవ్వుకి అర్థం బసవరాజుకి అప్పుడు తెలియలేదు. ఆ మర్నాడు తెలిసింది. అది వేరే కథ.

సాయింత్రం పెద్ద మేష్టారు ఊళ్లో ఉన్న ఆస్పత్రికి వెళ్ళి అధికారిని కలిసాడు. పెద్ద మేష్టారు వచ్చిన పని తెలుసుకొని ఆయన ఉత్సాహంగా లేచి కూర్చున్నాడు. చాలా రోజులుగా కళాశాలలు మూసి ఉన్న కారణంగా విద్యార్థుల కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం లేక బెంగ పెట్టుకొని మంచమెక్కాడు. అవకాశం రాగానే లేచి కూర్చున్నాడు. మంచం - దిగి,

"కార్యక్రమం ఏమిటి? నాకు దండలు వేస్తారు, నన్ను పరిచయం చేస్తారు. నేను విద్యార్థిగా ఉన్న రోజుల్లో గాంధీగారి నాయకత్వాన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గోడం చెప్తాను. సందేశాలిస్తాను. ఇంతేనా? ఇంకేమన్నా ఉందా? అన్నట్టు ప్రెస్‌స్టేట్‌మెంట్లిస్తాను. ఇంకా కావాలంటే విద్యార్థి నాయకులతో ఫొటోల్దిగుతాను. ఇదే బోలుడు. ఇంకేం పెట్టకండి" అని కార్యక్రమం నిర్ణయించాడు.

ఇదల్లా జరుగుతుండగా ఒక అపరిచిత యువకుడు "బసవరాజుగారెక్కడ?" అని బసవరాజుని ప్రశ్నించాడు.

"ఇక్కడే! బసవరాజుని నేనే" అన్నాడు బసవరాజు.

"మీరు బసవరాజుగారు కాదు. ఆయనకి గుండె పోటు వచ్చిందని, ఆయన చెయ్యి గుండె మీద నుంచి తియ్యడం లేదని వినివచ్చాను. నేను గుండె పోటు మీద చేద్దామనుకొన్న రిసెర్చికి ఆయనని పరీక్షించాలి".

"నేనే బసవరాజుని. నేను ఓ గంట క్రితం చెయ్యి నొప్పి పెట్టి గుండె మీద నుంచి తీసేసాను. క్షమించండి ఇప్పుడు నాకు గుండె నొప్పి లేదు."

"పోనీ మీకానొప్పి మళ్ళీ ఎప్పుడువస్తుంది? మీరు చనిపోయే లోపల మీ వల్ల శాస్త్రానికి జరగాల్సిన మేలు చాలా ఉంది."

'మీ చిరునామా ఇచ్చి వెళ్ళండి. ఈ బలహీనవు గుండెకి ఆటు పోట్లు తప్పవు. ఈసారి పోటు రాగానే మీకు తెలియజేస్తాను" బసవరాజు ప్రమాణం చేసాడు. వైద్య యువకుడు రోగులు ఇల్లాంటి శాస్త్ర ప్రయోగాలకి సహకరించాల్సిన అవసరం గురించి మరోసారి గుర్తుచేసి సెలవు పుచ్చుకొన్నాడు.

ఆ మర్నాడు రానే వచ్చింది. బసవరాజు హుషారుగా ఆ మధ్యాహ్నం పూర్తి పిరియడు పాఠం చెప్దామని క్లాసుకి వెళ్ళాడు. క్లాసులో ఒకే ఒక విద్యార్థి కనిపించాడు. బసవరాజు అతన్ని, "మిగిలిన వాళ్ళేరి?" అని అడిగాడు.

"ఇవాళ ఏర్పాటైన దశ దినోత్సవానికి వేదిక నిర్మించడం, మైకులు ఏర్పాటు చెయ్యటం లాంటి పనులు మేమే చెయ్యాలికదా! అందుకని ఈ మధ్యాహ్నం క్లాసులు మానుకోవాలని నిన్న మధ్యాహ్నమే నిర్ణయించుకొన్నాం. ఈ విషయం మీకు నిన్ననే చెప్దామనుకొని మీ గుండె బలహీనంగా ఉన్నప్పుడు చెప్పరాదని మానేసాము" అన్నాడా విద్యార్థి. చెప్పడం పూర్తయ్యాక "నేను కూడా వెళ్తున్నాను మేష్టారూ!" అని లేచి వెళ్ళిపోయాడు.

బసవరాజు నెత్తి మీద చెయ్యి వేసుకొని బయటికి వచ్చాడు. ఆ సాయంత్రం జరిగే ఉత్సవంలో మేష్టర్లందరు కలిసి భస్మాసుర హస్తం అన్న నాటకం వేస్తున్నారని, భస్మాసురుల్లాంటి మేష్టర్లు కొందరు పరీక్షల్లో విద్యార్థుల నెత్తిన చేతులు పెట్టడాన్ని మనసులో పెట్టుకొని విశాల హృదయుడైన బసవరాజు నాటకం వ్రాసాడని, అందులో భస్మాసురుడి వేషం ఆయనే వేస్తున్నాడని రిహార్సల్‌కి టైము చాలానందున ఆయన నాటకంలో తన పోర్షన్ రోడ్డు మీదే ప్రాక్టీస్ చేస్తున్నాడని మరో పుకారు పుట్టింది.

సాయంత్రం నాలుగు గంటలకి అనుకొన్న కార్యక్రమం అనుకొన్నట్టుగా నాలుగు గంటలకే ప్రారంభమైంది. స్వాగతవచనాలు పలికిన విద్యార్థి, "కళాశాలలు ఎంతెంత డబ్బు జీతాలుగా పడేసి పుచ్చుకొంటున్నా, పట్టుమని పది రోజులు కూడా విద్యార్థులకి పాఠాలు చెప్పడం లేదని, మేష్టర్లు తీసుకొంటున్నవి న్యాయానికి జీతాలు కావని పింఛన్లని, ఈ దౌర్భాగ్యపు రోజులు పోగొట్టి, బంగారు కాలాన్ని నవ చైతన్యంతో, చమటోడ్చి విద్యార్థులు నిర్మించాలని, వయస్సు మళ్ళిన సోమేశ్వరులు అయిన ఉపాధ్యాయులకి వదలరాదని, ఏది ఎల్లా అయినా ఈనాటి కార్యక్రమానికి పెద్దవారు రావటంతోను, విద్యార్థులంతా రావటంతోను పురోభివృద్ధికి మొదటి అడుగు పడిం"దని చెప్పాడు.

బసవరాజు నెత్తి మీద నుంచి చెయ్యి తీసి, ముక్కు మీద వేలు మాత్రం వేసుకొన్నాడు.

పెద్ద మేష్టారు లేచి స్వయాన విద్యాశాఖాధికారిగారు ఈ కార్యక్రమానికి రావటం వల్ల సభకి శోభ వచ్చిందని చెప్పి "ఈ రోజు అంటే డిసెంబర్ 19వ తారీకున ఈ సంవత్సరం అంటే 1978వ సవత్సరం దశ దినోత్సవం జరుపుకొంటున్నాం. 1979వ సంవత్సరం డిసెంబర్ 19వ

తారీఖున పదమూడ్రోజుల పండుగ 1980వ సంవత్సరం డిశంబర్ 19వ తారీకున పదహార్రోజుల పండుగ చేసుకోవాలి. అల్లా చెయ్యగలిగితేనే పురోభివృద్ధి సాధించినట్లు'' అని వక్కాణించారు.

ఆ పైన ముఖ్యాతిథి మాటాడ్తూ ఆ రోజు ఆ కళాశాల దశ దినోత్సవం జరుపుకోవడం చాలా గొప్ప విషయమని, అటువంటి దినాలు కళాశాలల జీవితాలలో మైలు రాళ్ళని, అందులో తను పాలుపంచుకోగలగడం మరీఅదృష్టం అని, ఈ దశ దినోత్సవాలు ప్రతి యేట ప్రతి కళాశాలలోను జరుపుకోవాల్సిన పండుగలని, జాతి భవితవ్యం దాని మీద ఆధారపడుతుందని చెప్పాడు. ఆ చివరి మాట ప్రెస్సు వాళ్ల నుద్దేశించి చెప్పాడు. ఆ తరువాత విద్యార్థి నాయకులకి ఆయనకి కలిపి ఫొటోగ్రాఫర్లు ఫొటోలు తీసారు. ఈ గొడవలో ఆఫీసు నుంచి కబురు వచ్చి పెద్ద మేష్టారు అటు వెళ్ళారు.

చివరలో మొదటి వర్గం నాయకుడు కృతజ్ఞతలు చెప్పాడు. అందులో తన ముందు మాట్లాడిన వక్తలందరు ప్రగతికి తప్పు నిర్వచనాలిచ్చారన్నాడు. "ఈ యేడు డిసెంబర్ 19న జరుపుకొన్న దశ దినోత్సవం. మరునటేడు జనవరి 15న జరుపుకొంటే అదీ పురోభివృద్ధి. ఈ తారీకు, విద్యా సంవత్సరం ఆరంభదినం నుంచి ఎంత దూరంగా జరిగితే అంత ముందంజ వేసినట్టు. అభివృద్ధి నిరోధక శక్తులు తమని తప్పుదారులు పట్టించడానికి ప్రయత్నించినంత మాత్రాన మేము మోసపోము. అదల్లా ఉంచండి. ఈ రోజు పిలవగానే అన్ని జబ్బులు మానుకొని వచ్చిన విద్యాశాఖాధికారిగారికి, అలజడులు మానుకొనివచ్చిన మీకు, పేకాటలు మానుకొని వచ్చిన మేష్టర్లకి మా తరపున నా కృతజ్ఞతలు"

అతని కృతజ్ఞతలు పూర్తయ్యేసరికి పెద్ద మేష్టారు ఉరుకులతో పరుగులతో వచ్చి "శ్రీమతి ఇందిరాగాంధీ అరెస్టయిన విషయం ఇప్పుడే తెలిసింది. ఆ సందర్భంగా అలజడులు జరుగకుండా మీకు రేపటి నుంచి సంక్రాంతి సెలవలిస్తున్నాను" అని ప్రకటించాడు.

"కాలేజీలు మూస్తే మును స్ట్రైక్ లెల్లాచేస్తాం? కాలేజీలెల్లా మూయిస్తాం? ఉపాధ్యాయుల దౌర్జన్యాలు...."

"నశించాలి"

"అలజడులు......'"

"వర్థిల్లాలి"

'విద్యార్థులు లేని అలజడులు, పిల్లలు లేని లోగిళ్ళు శోభించవు' అంటూ అధికార రాజకీయ పక్షం వాపోయిందా మర్నాడు.

"నాకీ సంవత్సరం మరో క్లాసుంటుందా?" అని ఆలోచనలో పడిపోయాడు బసవరాజు.

(- జ్యేష్ఠకే అంకితం! -రచయిత)

*-ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 79*

★